అడుగంటిన భూగర్భ జలాలు.. ఆందోళనలో రైతులు

- ఆకుకూరలకు సాగునీటి సమస్య
- అందని నాగార్జునసాగర్ నీళ్లు
- ఎండిపోతున్న పంటలు

అచ్చంపేట: పత్తి, మిర్చి పంటలు వేసి పెట్టుబడులు రాక, పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. తక్కువ వ్యవధిలో పండే ఆకుకూరలు వేస్తే కనీసం కౌలు రేట్లు అయినా వస్తాయన్న గంపెడాశతో ఉన్న రైతులకు ఆ పంటలలో కూడా చుక్కెదురైంది. భూగర్భ జలాలు ఎండిపోయి, నాగార్జున సాగర్ కెనాల్ నుంచి వచ్చే నీళ్ల చివరి భూములకు అందకపోవడంలో వేసిన ఆకుకూరలు ఎండిపోయే దశకు చేరాయి. ఉన్న బోర్లలో వ్యవసాయ మోటార్ల ద్వారా, ఆయిల్ ఇంజన్ల ద్వారా నీళ్ల పెట్టుకుందామన్నా రెండు, మూడు గంటలు వేసినా రెండు మూడు మడులు కూడా తడవడం లేదని, బోర్ల నుంచి నీళ్ల సన్నగా, ముురుగుగా వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.



నీళ్లులేక పాలిపోయిన కొత్తిమీర



ఎదుగుదల లేని గోంగూర

ఎకరాకు రూ.50 వేలు పైనే

ఆకు కూరలు పంటలు వేయడానికి ఎకరాకు అరకల నుంచి, ఎరువు మందు కట్టలు, కోతకూలి వరకు సుమారు రూ.50 వేలకు పైగా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఒక దాంట్లో కాకపోయినా మరోదాంట్లోనైనా లాభం వస్తుందన్న నమ్మకంతో ఎకరా భూమిలో 5, 6 రకాల ఆకుకూరల పంటలు వేస్తున్నారు. ఒక్కొక్క రైతు 1, 2 ఎకరాలలో ఆకుకూరలు పండిస్తున్నారు. నీలేశ్వరపాలెం, అచ్చంపేట, తాళ్లచెరువు, చిగురుపాడు తదితర గ్రామాలలో ఆకుకూరల పంటలు ఎక్కువగా వేశారు.

పత్తి, మిర్చి తరువాత వేసే పంటలు

ఈ ప్రాంత రైతులు ఎక్కువగా పత్తి, మిర్చి పంటలు వేసి, కనీసం పొలం కౌలు కూడా రాక ఈ పంటలు వేసేందుకు ఎక్కువ మొగ్గ చూపుతున్నారు. కనీసం ఇవి పండితేనైనా భూ యజమానికి కౌలు చెల్లించవచ్చన్న ఆశ పడుతున్నారు. కాని వారి ఆశలు అడియాశలవుతున్నాయి. ఈ పంటలు ఫిబ్రవరి, మార్చి నెలల్లో వేస్తే మూడు నెలల వ్యవధి అంటే మే, జూన్ నాటికి చేతికందుతాయి. అయితే ఈ పంటలకు సమృద్ధిగా నీళ్ల ఉండాలి. కానీ పులిచింతల ప్రాజెక్టులో నీటి మట్టం గణనీయంగా తగ్గడంతో ఈ ప్రాంతమంతా భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లలో నీళ్ల అడుగంటాయి. రైతులు ఎక్కువగా తోటకూర, పాలకూర, చుక్కకూర, గోంగూర, పుదీన, కొత్తిమీర వంటివి పండిస్తున్నారు. వీటిలో కూడా పెట్టుబడులైనా వస్తాయన్న నమ్మకాన్ని రైతులు కోల్పోయారు. సాగర్ కెనాల్ వాటర్ అసలు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నా



నేను రెండు ఎకరాల పొలాన్ని ఎకరా రూ.25 వేలు చొప్పున కౌలుకు తీసుకున్నా. ఒక ఎకరంలో మొదటి పంటగా పత్తి, మరో ఎకరంలో మిర్చి పంటలు వేశా. పత్తి పంట పూర్తిగా ధ్వంసమైంది, మిర్చి దిగుబడి బాగా తగ్గింది. పండిన పంటకు కూడా ధర లేదు. దీంతో రెండవ పంటగా రెండెకరాల విస్తీర్ణంలో ఐదు రకాల ఆకు కూరలు వేశా. ఒక మోస్తరుగా పెరిగాయి. కానీ భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు నుంచి నీళ్ల సన్నగా, మురికిగా వస్తున్నాయి. సాగర్ నీళ్ల రావడం లేదు. పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. నీళ్ల సమృద్ధిగా ఉంటే ఆకుకూర పంటలు బాగా పండుతాయి.

– కొమరాల నరసింహారావు, రైతు, అచ్చంపేట

స్వయంగా విక్రయాలు

ఈ పంటలు రోజువారి ఆదాయాన్ని ఇస్తాయి. పండిన కాస్తో, కూస్తో పంటలను తోపుడు బండ్లపై ఇంటింటికి తిరిగి అమ్ముకుంటున్నారు. మార్కెట్‌కు తరలించాలంటే వ్యాపారస్తులు తమ వద్ద తక్కువ ధరకు కొని, రెండింతలు ఎక్కువకు వినియోగదారులకు విక్రయిస్తారని, అప్పుడు పూర్తిగా నష్టాలు పాలవుతామన్న భయంతో తోపుడు బండ్లను అద్దెకు తీసుకుని తామే స్వయంగా అమ్ముకుంటామని రైతులు చెబుతున్నారు.

క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



రాజుపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన వ్యాధులు దరిదాపుల్లోకి రావని డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. మండలంలోని బలిజేపల్లి గ్రామంలో ఫ్రై డే–డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉంచడం వలన దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగీ, బోద వంటి వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. రెండు రోజులు వరుసగా జ్వరం వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఏఎన్‌ఎంలు శ్రీకళ, సరళ, ఆశా కార్యకర్త ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్ సాంబశివరావుకు సత్కారం



సత్తెనపల్లి: మున్సిపల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.సాంబశివరావు ఈ నెల 31న పదవీ విరమణ దృష్ట్యా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయనను సత్కరించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసిలు పూల బొకేలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్, మున్సిపల్ డీఈ తోట వెంకటరమణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ సెక్షన్ హెడ్లు, సిబ్బంది ఉన్నారు.

మూడు నెలల్లో 300 నీటి గుంతలు పూర్తి చేయాలి

ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు



అచ్చంపేట: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాలలో వచ్చే మూడు నెలల కాలంలో రైతుల పొలాల్లో 300 పైగా ఫాం పాండ్లు ప్రారంభించి పూర్తి చేయాలని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాం పాండ్ల ద్వారా రెండు లక్షల పని దినాలు పూర్తి చేయాలని, ప్రతి ఉపాధి కూలికి రూ.290 నుంచి రూ.300 వరకు దినసరి వేతనం వచ్చే విధంగా సాంకేతిక సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు, చెరువులను పునరుద్ధరించి భూ గర్భ జలాలు పెంపొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, జూనియర్ ఇంజనీరు బి.రమణమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు సీహెచ్ రాజవర్ధన, ఎన్.శేషారావు, కంప్యూటర్ ఆపరేటర్ ఎస్.జయరాజు పాల్గొన్నారు.

సమగ్ర ఆరోగ్య సర్వే పరిశీలన



అనంతవరం(క్రోసూరు): నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌ను గుర్తించే కార్యక్రమంలో శుక్రవారం మండల ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ మండలం అనంతవరంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచిత పరీక్షలు నిర్వహిస్తూ, గుండె జబ్బులు, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించే కార్యక్రమం ఆరోగ్య శాఖ చేపట్టిందన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబిస్తూ, పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ధూమపానం, మద్యం దరి చేరనీయకూడదని, గుట్కా, ఖైనీ, పాన్ వంటివి నోట్లో పెట్టుకుంటే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు.

టీటీడీ పంచాంగ పఠనకర్తగా 'పులుపుల'కు ఆహ్వానం

బెల్లంకొండ: తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో జరిగే ఉగాది పర్వదిన వేడుకలలో పంచాంగ పఠనకర్తగా వ్యవహరించడానికి బెల్లంకొండకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, జ్యోతిష్య పండితులు బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణి కుమార శర్మ ఆహ్వానం అందుకున్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 30న తిరుపతి మహతి ఆడిటోరియంలో ఉగాది వేడుకలలో పంచాంగ పఠనం చేయనున్నట్లు తెలిపారు.

పంచ ప్రాధాన్యాలతో పనులు చేపట్టాలి

ముప్పాళ్ళ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా అన్ని గ్రామాల్లోను పంచ ప్రాధాన్యాలు కల్పిస్తూ పనులు పూర్తి చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ జి.ఏడుకొండలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు నిర్వహించే పనులన్నీ ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టాలన్నారు. పశువులకు నీటి తొట్లు, సేద్యపు కుంటలు, పంట కాలువలను పునరుద్ధరించడం, చెరువులు/కుంటలను సమగ్రంగా అభివృద్ధి పరచడం లాంటి పనులకు ప్రాధాన్యత కల్పించి పూర్తి చేయాలన్నారు. ప్రతి కూలీకి దినసరి వేతనంగా రూ.300 పొందేలా కొలతల ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలోను ఇదే రీతిలో పనులు చేపట్టాలన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించాలి

బెల్లంకొండ: రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ అశ్రవున్నీసా బేగం తెలిపారు. మండల వ్యాప్తంగా 29,022 మందికి గాను 25,879 మంది ఈ–కేవైసీ చేయించుకున్నారన్నారు. ఇంకా 3,143 మంది ఈ–కేవైసీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ–కేవైసీ చేయించుకోని వారు సమీపంలోని రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి చేయించుకోవాలని సూచించారు. వచ్చే నెల నుంచి రేషన్ పొందాలంటే తప్పనిసరిగా చేయించుకోవాలని, మార్చి 31 వరకు మాత్రమే ఈ అవకాశం ఉందని తెలిపారు.

రుణ అర్హత మేళాకు 210 మంది హాజరు



రుణ అర్హత మేళాలో అధికారులు, అభ్యర్థులు

సత్తెనపల్లి: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓబీ ఎంఎంఎస్ ద్వారా బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం రుణ అర్హత మేళా నిర్వహించారు. మొత్తం 272 మందికి గాను 210 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ పుస్తకం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కార్పొరేషన్ బ్యాంకుకు దరఖాస్తు చేసిన దరఖాస్తులను అధికారులు తీసుకున్నారు. ఎంపీడీఓ బండి శ్రీనివాస రెడ్డి, మండల విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బెల్లంకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రుణ మేళా నిర్వహించినట్లు ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. ఈ రుణ మేళాకు వివిధ గ్రామాల నుంచి 109 మంది దరఖాస్తుదారులు హాజరైనట్లు తెలిపారు. మండలంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు, సెలక్షన్ కమిటీ సభ్యులు దరఖాస్తులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రెడిట్ క్యాంపుకు స్పందన కరువు

పెదకూరపాడు : పెదకూరపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో ఓబీ ఎంఎంఎస్ ద్వారా ఓబీసీ, కాపు, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ లబ్ధిదారులకు నిర్వహించిన రుణ అర్హత మేళా (క్రెడిట్ క్యాంపు)కు స్పందన కరువైంది. ఈ మేళాకు మొత్తం 168 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా కేవలం 95 మంది హాజరయ్యారు.



అనారోగ్యంతో హోంగార్డు మృతి



మహబూబ్ షరీఫ్

నకరికల్లు: అనారోగ్యంతో చికిత్స పొందుతూ హోంగార్డు మృతి చెందాడు. నకరికల్లు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా, డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ.. హోంగార్డు బాబుగా పిలువబడుతూ అందరికీ సుపరిచితుడైన షేక్ మహబూబ్ షరీఫ్(60) శుక్రవారం గుంటూరులో కన్నుమూశారు. స్థానికుడైన ఇతను గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతనికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు, ఎస్ఐ చల్లా సురేష్, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్స్, పోలీస్ సిబ్బంది, సహచర సిబ్బంది అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. హోంగార్డు షరీఫ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

గ్రీన్ అంబాసిడర్‌లకు దుస్తులు పంపిణీ

నకరికల్లు: పేదలు కూడా పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. న్యాయవాది షేక్ అలీ బాషా ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం పరిధిలో గ్రీన్ అంబాసిడర్‌లకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పురస్కరించుకొని దుస్తులు పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శౌరయ్య, బాజీ చౌదరి, శ్రీనివాసరావు, సర్పంచ్ తంజమ్మ, ఈఓపీఆర్డీ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను తక్షణమే తగ్గించాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య



మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

సత్తెనపల్లి: ప్రజలపై భారం మోపే ఆస్తి పన్నులను తక్షణమే తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెంచిన ఆస్తి పన్నులను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె చలమయ్య మాట్లాడుతూ ఏప్రిల్ 2025 నుంచి ఆస్తి పన్ను పెంపుదలను నిలిపివేయాలన్నారు. ఆస్తి పన్నుకు సంబంధించి జీవో 198, సవరణ చట్టం నెం .44/2020ను రద్దు చేయాలన్నారు. ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ 100 శాతం రద్దు చేయాలన్నారు. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించటానికి గడువు మే నెల ఆఖరి వరకు ఇవ్వాలని, ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ 24 శాతంను రద్దుచేసి బ్యాంకు వడ్డీని గీటురాయిగా తీసుకోవాలన్నారు. ఏ ఆర్థిక సంవత్సరంలో బకాయిలకు ఆ ఆర్థిక సంవత్సరంలోనే వడ్డీ విధించే పద్ధతిని తొలగించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.విమల, మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, జిల్లా కమిటీ సభ్యురాలు గుంటూరు మల్లేశ్వరి, నాయకులు జె.రాజ్‌కుమార్, షేక్ మస్తాన్‌వలి, కె.జగన్‌మోహన్‌రావు, పులిపాటి రామారావు, షేక్ సాయిబా, పంతంగి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడదాం



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

రాజుపాలెం: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేస్తూ అంతర పంటలు వేయడం ద్వారా భూమికి కావాల్సిన సూక్ష్మపోషకాలు వృద్ధి చెంది భూమి ఆరోగ్యంగా ఉంటుందని బలిజేపల్లి యూనిట్ ఇన్‌చార్జి టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జి మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్‌లో భాగంగా ప్రతి రైతు భూమి విస్తరణ, పంటలు, పాడి పశువుల వివరాలను సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. గణపవరం యూనిట్ ఇన్‌చార్జి కె.జ్యోతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ప్రజలు, రైతులు భాగస్వామ్యమై ప్రకృతి వయ్వసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబూ నాయక్, సిబ్బంది నరసింహారావు, రాణి, బాలమ్మభాయి, యలమందమ్మ, నరసింహారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రోస్టర్‌లో మాదిగలకు అన్యాయం

క్రోసూరు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ వలన మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి గౌరవ చైర్మన్ గార్లపాడు దాసు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. గార్లపాటి దాసు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రోస్టర్ విధానంలో మాదిగలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, 100 పోస్టులకు 6 పోస్టులు మాదిగలు నష్టపోతున్నారని, మరీ ముఖ్యంగా గ్రూప్–2కి సంబంధించి 1వ సైకిల్‌లో 6 రోస్టర్ పాయింట్లు, 2వ సైకిల్ లో 7 రోస్టర్ పాయింట్లను కేటాయించాలన్న ప్రతిపాదన అభ్యంతరకరమైనదన్నారు. మాదిగలకు 1వ సైకిల్‌లో 7 రోస్టర్ పాయింట్లు, 2 వ సైకిల్‌లో 6 రోస్టర్ పాయింట్లను కేటాయించేలా ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ సరిచేయాలని సీఎం చంద్రబాబుకు, వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ న్యాయ సలహా డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీలకు మెయిల్ చేయటం జరిగిందన్నారు. తద్వారా ఉపాధి, విద్యలో సామాజిక సమతుల్యతకు ప్రాతినిధ్యం ఉండేలా అవకాశం ఉంటుందని దాసు అన్నారు.

వరద నీటి కాలువ ఊర్లోకా .. కాలువ లోకా!

- అసంతృప్తి వ్యక్తం చేసిన 4వ వార్డు కౌన్సిలర్ రామకృష్ణ
- ప్రజా సమస్యలపై ఏకరవు పెట్టిన పలువురు కౌన్సిలర్లు

సత్తెనపల్లి: వరద నీటి కాలువ నిర్మాణం ఊర్లోకా.. కాలువ లోకా చెప్పాలని 4వ వార్డు అధికార పార్టీ కౌన్సిలర్ కటకం రామకృష్ణ ప్రశ్నించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు శుక్రవారం జరిగాయి. ఈ సమావేశంలో 4వ వార్డ్ కౌన్సిలర్ కటకం రామకృష్ణ మాట్లాడుతూ సాధారణ సమావేశంలోని 47వ అంశంలో 15వ ఆర్థిక సంఘం 2023–24 రెండో విడత అన్‌టైడ్ గ్రాంట్ నిధులకు సంబంధించి వడ్డీతో కలుపుకొని రూ.80,00,447తో పట్టణ పరిధిలోని 11వ వార్డు రఘురాం నగర్ డొంక రోడ్డుకు దక్షిణం వైపున ఎన్ఎస్పీ వారి గుంటూరు బ్రాంచ్ కెనాల్ వైపునకు వరద నీటి కాలువ నిర్మాణం చేయు పనికి పెట్టగా దీనిపై ఆయన ప్రశ్నించారు. దీనికి ఏమాత్రం అధికారుల నుంచి గానీ, ఎక్స్ అఫీషియో హోదాలో హాజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నుంచి గానీ సమాధానం రాకపోగా కూర్చోమనే సంకేతం పంపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

■ అలాగే అత్యవసర సమావేశంలో ఈ–ఆటోలకు చార్జింగ్ నిమిత్తం రూ.35 లక్షలతో షెడ్డు నిర్మాణం పెట్టగా, సాధారణ సమావేశంలో ఈ–ఆటోలకు చార్జింగ్ సౌకర్యాలు, వాహన షెడ్‌లో లైటింగ్ ఏర్పాటుకు రూ.2 లక్షలు అంచనా విలువతో పెట్టడంపై రామకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండూ ఒకే అంశానికి సంబంధించినప్పుడు ఒకే దానిలో పెట్టకుండా వేర్వేరుగా పెట్టడం ఏమిటని కౌన్సిలర్ రామకృష్ణ ప్రశ్నించగా ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తూ కూర్చోమన్నారు. దీంతో తాను కూడా అసంతృప్తితోనే కూర్చుంటున్నట్లు కౌన్సిలర్ రామకృష్ణ ప్రకటించారు.

■ 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ ఎన్జీవోస్ బిల్డింగ్‌కు కమర్షియల్ కాంప్లెక్స్ ఉందని దాని నుంచి ఆదాయం వస్తున్నప్పుడు పన్ను మినహాయింపు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పన్ను మినహాయింపు ఎందుకు ఇవ్వాలో కనుక్కోమని అధికారులకు సూచించారు.

■ రేషన్ కార్డులకు సంబంధించి ఈ–కేవైసీ ఈ నెల 31తో పూర్తవుతుందని, కానీ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ఎక్కువ మంది రేషన్ కార్డులు కోల్పోయే ప్రమాదం ఉందని సమావేశం దృష్టికి తీసుకురాగా దీనిపై కొంత సమయం పెంచేందుకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు.

■ మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో డ్రైన్స్ క్లీన్ చేయాల్సింది పోయి కొన్ని వార్డుల్లో మాత్రమే పెట్టారని ప్రశ్నించారు. దీనిపై రెండు అడుగుల పైన ఉన్న ప్రతి డ్రైన్ క్లీన్ చేయిస్తామని మున్సిపల్ డీఈ తోట వెంకటరమణ అన్నారు.

■ మున్సిపల్ వైస్ చైర్మన్ రమావతి కోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ నిధులన్నీ ఒకే ఏరియాలో ఖర్చు చేస్తున్నారని, అన్ని వార్డుల్లో పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. తమ వార్డులో బరియల్ గ్రౌండ్, కమ్యూనిటీ హాలు సగంలోనే ఉన్నాయన్నారు. దీనిపై మీరు అడిగితే మీ వార్డుల్లో సమస్యలకు నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే కన్నా అన్నారు. రూ.3 కోట్లతో నరసరావుపేట రోడ్డు వైడెనింగ్, రూ.22 కోట్లతో పట్టణం ముంపుకు గురి కాకుండా ఉండేందుకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరానన్నారు.

■ 6వ వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌రోడ్డు 40 అడుగులు మాస్టర్ ప్లాన్‌లో ఉందని, సర్వే నెంబర్ 205లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నారని, అన్‌ఎయిడెడ్ స్కూల్స్, కళ్యాణ మండపాలు, ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆక్రమణలు, ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యాపార సముదాయాలు ఆస్తి పన్ను చెల్లించడం లేదని అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ వెంటనే ఆ ప్రాంతాన్ని అధికారులు పరిశీలించాలని, ఆస్తి పన్ను ఎందుకు చెల్లించడం లేదో చర్యలు చేపట్టాలన్నారు.



హాజరైన కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు

■ 20వ వార్డు కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి మాట్లాడుతూ పట్టణంలోని 11వ సచివాలయ అధికారుల తీరు బాగాలేదని, ఇష్టారాజ్యంగా సెలవులు పెడుతున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై స్వయంగా తనను కలవాలని, అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. సచివాలయ సిబ్బందితో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆనంద్‌కుమార్‌కు సూచించారు. + కో ఆప్షన్ మెంబర్ కొణతం స్వాతి మాట్లాడుతూ తమ వార్డులో కాలువలు అధ్వానంగా ఉన్నాయని, చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ విజయసారథి మాట్లాడుతూ పరిశీలిస్తానని చెప్పడంతో స్పందించిన ఎమ్మెల్యే కన్నా ఓ వైపు చెత్త సేకరణ జరగడం లేదంటూ ఉంటే పరిశీలిస్తానని చెప్పడం ఏమిటని తక్షణమే ఆ వార్డులో చెత్త సేకరణ చేపట్టాలన్నారు. సాధారణ, అత్యవసర సమావేశాల్లో అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, కోఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, పాల్గొన్నారు.

నవధాన్య విధానంతో అధిక దిగుబడులు

ఏడీఏ హనుమంతరావు



మాట్లాడుతున్న ఏడీఏ హనుమంతరావు

అచ్చంపేట: వచ్చే వ్యవసాయ సీజన్ ప్రారంభంలో రైతులంతా నవధాన్య విధానం పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు తెలిపారు. స్థానిక కో ఆపరేటివ్ సహకార సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ, అనుబంధ శాఖలైన సెర్ప్, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బందితో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులు తమ భూములలో నవధాన్య విత్తనాలను చల్లాలన్నారు. అవి మొక్కలుగా మారగానే భూమిలో చీడపీడల నివారణ జరుగుతుందన్నారు. రైతులు తమ కున్న భూమిలో పీఎండీఎస్ (నవధాన్య) విధానం ఆచరించడం ద్వారా భూమిలో సూక్ష్మ జీవులు వృద్ధి చెంది, భూమికి కార్బన్ శాతం చేరడంతోపాటు పశువులకు మేతగా కూడా ఉపయోగపడతాయన్నారు. కలుపు శాతం తగ్గుతుందన్నారు. భూమిలో నీటిని నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. సిబ్బంది రైతులను ప్రకృతి విధానం వైపు తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, ఏపీఎం సలీమ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉషారాణి, జిల్లా ట్రైనీ సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

మాస శివరాత్రి పూజలు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో మాసశివరాత్రిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధికెక్కిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. స్వామి వార్లకు విశేష ద్రవ్యాలతో అభిషేకములు చేశారు.

● అయోధ్యస్వామి ఆశ్రమంలో మాస శివరాత్రి

పెదకూరపాడు : మండల పరిధిలోని అవధూత అయోధ్యస్వామి ఆశ్రమంలో మాస శివరాత్రి పురస్కరించుకొని శుక్రవారం మహన్యాస రుద్రాభిషేకం, అయోధ్య స్వామి ఉత్సవ విగ్రహానికి, శివలింగానికి పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహించారు. పండితులు ఆదిత్య శర్మ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.